ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
బుధవారం 10-06-2026 పేజీలు : 16

## ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే కలిసిన ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్



అలంపూర్ జూన్ 09 (విజన్ ఆంధ్ర) ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

### చౌటకూర్ సమీప హైవేపై

## ఘోర రోడ్డు ప్రమాదం





### - బైక్‌ను ఢీకొన్న కారు.. కార్మికుడు మృతి

చౌటకూర్, జూన్ 09 ( విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం పరిధిలోని హున్నాపూర్ గ్రామం సమీపంలోని జాతీయ రహదారి-161పై మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, అందోల్ మండలం డాకూరు గ్రామానికి చెందిన మహమ్మద్ అద్నాన్ (29) మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా, హున్నాపూర్ సమీపంలో వేగంగా వచ్చిన ఓ కారు ఆయన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అద్నాన్ తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన

# ప్రతీ ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



2 పేజీలో

## దళితుల భూములపై కన్నేస్తే ఊరుకోం



**49 ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూమికి రక్షణ కవచం,**

**సర్వే పూర్తయ్యాక ఫెన్సింగ్,**

**కబ్జాదారులపై కఠిన చర్యలు,**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 9, (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

11 పేజీలో...

## సాయినగర్ డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- స్థానికులకు, విద్యార్థినులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ

ఫిర్యాదు అందిన వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న మంత్రి

ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డ్‌పై ఆందోళన

పూర్తిస్థాయి శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

సమస్య పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు

మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన కొలన్ హన్మంత్ రెడ్డి



6 పేజీలో...

# "పెరిగిన ధరలను కేంద్రం తగ్గించాలి"



మందమర్రి, జూన్ 9 (విజన్ ఆంధ్ర) : పెరిగిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. ఈ నెల 10 న మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ముందు తలపెట్టే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో లింగయ్య,పౌలు,సాంబయ్య,గోపి,వెంకటస్వామి,కౌన్సిలర్లు శంకర్,ముని తదితరులు పాల్గొన్నారు.

# నేడు బహిరంగ ఇసుక వేలం పాట



ముధోల్:09జూన్:విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రమైన ముధోల్ తహసి ల్దార్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ ఇసుక వేలం పాటను నిర్వహించనున్నట్లు ముధోల్ తహసిల్దార్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నామన్నారు. పట్టుకున్న ఇసుక హైచర్, టిప్పర్లు 04, టాక్టర్ 03 వేలం పాట చేస్తు న్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలం పాటలో రూ.1000 దారవత్తు పాల్గొ న్నారు.

# బసప్ప క్యాంపులో అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన

బూర్గంపాడు మండల ప్రతినిధి జూన్ 9 (విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోగల బసప్ప క్యాంపులో అంగనవాడి భవనం నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ భూమి పూజ, ఐటిసి పి ఎస్ పి డి అధికారులు చంగల్ రావు పలువురు అధికారులు విచ్చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్ మాట్లాడుతూ నేటి బాలురు రేపటి పౌరులు వారికి అనుకూలమైన వాతావరణం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తే వారు కల సహకారం అవుతుంది. విద్యార్థులు తమ కళా సహకారం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

స్థానికులు మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీ సారపాక సర్పంచ్ ఎన్నికల్లో హామీలో భాగంగా నేడు బూర్గంపాడు మండలం సారపాక బసప్ప క్యాంప్ నందు విద్యార్థులు భవిష్యత్తు కోసం రేపటి తరాల భావి భారత పౌరుల అత్యున్నత బాటల కోసం అంగన్వాడి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు



సిపిఐ పార్టీ సహకారంతో ఐ టి సి సౌజన్యంతో నూతన భవనానికి శంకుస్థాపన చేశారు.

కిషోర్ నాయక్ గెలిచిన నాటండి అభివృద్ధివైపే అడుగులు వేస్తూ ఉన్నారని జనాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్ నాయక్, వార్డు సభ్యురాలు బాలి కానకరత్నం, ఐటిసి డీజీఎం చంగల్ రావు, బాలి శ్రీహరి, బసప్ప రమేష్, పలువురు నేతలు స్థానికులు మహిళలు పాల్గొన్నారు

# కేజీబీవీలు, పాఠశాల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

## నాణ్యమైన విద్య, వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి

బెల్లంపల్లి జూన్ 9 విజన్ ఆంధ్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవం ంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి, కన్నేపల్లి, నెన్నెల మండలాల్లో పర్యటించిన ఆయన విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన పలు నిర్మాణ పనులను పరిశీలించారు.

బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్‌లో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు.

అనంతరం బెల్లంపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు.

కన్నేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, వార్డులు, మందుల నిల్వలు, పరిశుభ్రతను పరిశీలించారు.



ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తదుపరి కన్నేపల్లి, నెన్నెల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కొనసాగుతున్న భోజనశాలలు, ప్రహరీ గోడలు, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు

## -- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 09, (విజన్ ఆంధ్ర):ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం చిల్పూరు మండలంలోని పల్లగుట్ట గ్రామంలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేస్తున్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపద, వనరులను విచ్చలవిడిగా దోపిడి చేసిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారని అన్నారు. ఆ పాపానికి ఇప్పుడు మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్ల రూపాయలను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోందని తెలిపారు. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ. 76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప, డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బంది పడ్డి ట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ. 14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ. 5 వేల కోట్లను ప్రతి నెల ఆర్థిక శాఖ ద్వారా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్ సిఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే 'తగుదునమ్మా' అంటూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పేదల గృహనిర్మాణానికి పెద్దపీట గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరుతో పేదలను వంచించిందని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, తొలి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారతకు అండ మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపల్లిలో 232 కేవీ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యసాధ్యాలపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని అన్నారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని భట్టి అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, మామిడాల యశస్విని, చిల్పూరుగుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## "ఆర్థిక సంక్షోభానికి బీఆర్ఎస్ కారణం"

### – కాంట్రాక్టర్ వ్యాఖ్యలు అర్థరహితం

మందమర్రి, జూన్ 9 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ఆర్థిక సంక్షోభానికి బీఆర్ఎస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతనీ,పదేళ్ల ఆర్థిక విధానాలే అప్పులకు దారితీశాయని క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం స్థానిక సూపర్ బజార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. క్యాతన్ పల్లి రైల్వే ఫై ఓవర్ బ్రిడ్జి విషయంలో మంత్రిపై కాంట్రాక్టర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. అసలు వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలు మానుకోవాలని తెలిపారు. పెండింగ్ బిల్లుల కోసం ప్రయత్నించిన మంత్రిపై ఆరోపణలు చేయడం రాజకీయ ఉద్దేశాలతో చేస్తున్న ప్రచారంగా ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. అలాగే కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు,సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు సృజన,ప్రధాన కార్యదర్శి నరేందర్,నత్యనారాయణ, కార్యదర్శులు శ్రీనివాస్,మల్లేష్,రాజేశ్వరి పాల్గొన్నారు.

## వైభవంగా రేణుక ఎల్లమ్మ గుడిలో అధిక జేష్ఠ మాసం పూజలు

జనగామ జూన్ 9 ( విజన్ ఆంధ్ర ) జనగామ జిల్లా కేంద్రంలో మంగళవారం రోజున మూడో వార్డు బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ గుడిలో అధిక జేష్ఠ మాసం పూజలు నిర్వహించడం జరిగినది పూజల్లో భాగంగా మహిళలచే కుంకుమార్చనలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ హిందూ పంచాంగం ప్రకారం 32 నెలలకు ఒకసారి అధిక మాసం వస్తుందని ఈ మాసంలో ఆరాధనలు జపం పారాయణం ఉపవాసాలు దానధర్మాలు చేయడం వల్ల రెట్టింపు ఫలితాలు సిద్ధిస్తాయని, మన పితృదేవతలకు మోక్షం కలిగి దోషాలు పొరదోలుతాయని వంశం అభివృద్ధి చెందుతాయనే సంకల్పంతో అన్ని 33 రకాల ఫలాలు, పుష్పాలు, నైవేద్యాలు, వస్త్రాలతో పూజా కార్యక్రమం నిర్వహించమన్నారు ఈ కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, లోనే మంజుల, దోసపాటి శ్రీలక్ష్మి, పోగుల కవిత,యనగందుల రేణుక, అయిత రమాదేవి, బొడ్డు లక్ష్మి, రాంపురం అనిత, కొలనుపాక సునీత, అయిత కళావతి, వేముల్ల సువర్ణ, బండోజు సరళ, సంబోజు జ్యోతి, భార్గవి మరియు బస్తి భక్తులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి చిహ్నంగా బస్సు

## మర్పల్లి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బస్సుకు ఘన ప్రారంభోత్సవం

మర్పల్లి, జూన్ 9 (విజన్ ఆంధ్ర): మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకంలో భాగంగా మర్పల్లి మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) ఆధ్వర్యంలో బస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మహిళా శక్తి కార్యక్రమం కింద రాష్ట్రంలోని అన్ని మండల మహిళా సమాఖ్యలు కలిసి రూ. 199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి టీజీఎస్ఆర్టీసీకి అద్దెకు అందించాయి. ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం రుణగ్రహీతలుగా కాకుండా ఆస్తుల యజమానులుగా ఎదిగే అవకాశాన్ని పొందారు.

మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలుకు ఈ బస్సులు కీలకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంలో ఈ పథకం దోహదపడుతోంది. ఇప్పటి వరకు సుమారు 308 కోట్ల మహిళా ప్రయాణికులు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోగా, మహిళలు మొత్తం రూ. 10,696 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య సభ్యులు ఇందిరమ్మ చీరలు ధరించి, ప్రారంభించిన బస్సులోనే హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశానికి ఉత్సాహంగా బయలుదేరారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి, స్వేచ్ఛాయుత ప్రయాణానికి



ఈ బస్సులు ప్రతీకలుగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు సర్వేశ్, ఏపీఎం సమ్మయ్యతో పాటు మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ బస్సులు కేవలం వాహనాలు కాదు.. తెలంగాణ మహిళల ఆర్థిక స్వావలంబనకు, స్వేచ్ఛా ప్రయాణానికి రథచక్రాలు" అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

# మర్పల్లిలో ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు ఎక్కడ..?

### - రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు సకాలంలో అందేనా..?

### - వర్షాకాలం వేళ వ్యవసాయ శాఖ అప్రమత్తం కావాలని రైతుల డిమాండ్

మర్పల్లి, జూన్ 9 (విజన్ ఆంధ్ర): వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పొలాలను దున్ని విత్తనాల విత్తనానికి సిద్ధం చేసుకుంటున్న తరుణంలో మర్పల్లి మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికీ సమగ్ర తనిఖీలు నిర్వహించకపోవడం రైతుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో యూరియా కొరత, గ్రోమోర్ సంస్థలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలు వంటి సంఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. మండలంలోని అన్ని ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాల్లో నిల్వలు, విక్రయాలు, ధరలు, నాణ్యత ప్రమాణాలపై వ్యవసాయ శాఖతో పాటు విజిలెన్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు పర్యవేక్షించాలని, నిల్వలు మరియు ధరల వివరాలతో కూడిన బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. విక్రయించిన ప్రతి ఎరువు, విత్తనానికి రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కొంతమంది వ్యాపారులు ప్రముఖ కంపెనీల నాణ్యమైన విత్తనాల బదులుగా తక్కువ ధరలకు లభించే, నాణ్యతపై అనుమానాలు ఉన్న విత్తనాలను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు మండల వ్యవసాయ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ వెంటనే అప్రమత్తమై చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 9 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు మంగళ వారం రోజున వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏ ఓ కు , జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్తు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లల ఉన్నత విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యకు ప్రత్యేక రాయితీలు కల్పించడం ద్వారా మరింత భరోసా కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థల్లో ఫీజులు భారీగా పెరిగిన కారణంగా మధ్యతరగతి మరియు తక్కువ ఆదాయం కలిగిన జర్నలిస్టు కుటుంబాలు ఇబ్బందులు





ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యాపరమైన ప్రోత్సాహకాలు అందించడం సమాజం పట్ల ప్రభుత్వం చూపే గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, అలాగే ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక కోటా మరియు స్కాలర్‌షిప్‌లు అమలు చేయాలని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ మాట్లాడుతూ

జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం సేవలందిస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యా రంగంలో రాయితీలు కల్పించడం ద్వారా వారి సేవలను ప్రభుత్వం గుర్తించినట్టవుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక విద్యా సహాయ పథకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు యాదగిరి,ఆకుల రాజు, దుబ్బాక నియోజక వర్గం అధ్యక్షులు సిద్దిరాములు, ప్రధాన కార్యదర్శి పల్లె చిన్ని కృష్ణ గౌడ్ తో పాటు మండల నాయకులు, వర్కింగ్ జర్నలిస్టులు మరియు పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# అక్రమ స్క్రాప్ దుకాణాలు వేరే చోటుకు తరలించాలి

## - చైర్‌పర్సన్ దావ స్వాతి

బెల్లంపల్లి, జూన్ 9 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలోని పలు స్క్రాప్ దుకాణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జనావాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణాల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దావ స్వాతి మాట్లాడుతూ, స్థానిక వార్డుల ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు స్క్రాప్ దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. జనావాస ప్రాంతాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా, అపరిశుభ్ర వాతావరణంలో స్క్రాప్ దుకాణాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అక్రమంగా జనావాసాల్లో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాలను వెంటనే ఇతర అనువైన ప్రాంతాలకు తరలించాలని దుకాణ యజమానులకు సూచించారు. మున్సిపల్ నిబంధనలను పాటించని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు.

పట్టణంలో పరిశుభ్రత, భద్రతకు భంగం కలిగించే కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, తెలిపారు ఈ తనిఖీల్లో మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భానోతు రామ్ దాన్ పార్థీవ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే జీఎస్సార్...

భూపాలపల్లి జిల్లా,రేగొండ జూన్ 9,( విజన్ ఆంధ్ర) భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం రామన్నగూడెం తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త భానోతు రాందాన్ సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఈ విషాదకర వార్త తెలుసుకున్న భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం రామన్నగూడెం తండాకు చేరుకుని భానోతు రాందాన్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాందాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి మరణం పార్టీకి మరియు గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, స్థానిక సర్పంచ్ గుగులోతు రవళిక- వీరు,మాజీ సర్పంచ్ బానోతు బిక్య నాయక్, కాంగ్రెస్ ఎస్టి సెల్ మండల అధ్యక్షులు బానోతు రవీందర్, జంగిటి సుధాకర్, రాజయ్య, భూక్యరాజు, ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని నివాళులర్పించారు. కాగా మృతునికి భార్య కాశమ్మ,కుమారుడు బానోతు మోహన్,ఇద్దరు కూతుర్లు ఉన్నారు.



# ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటిన ఎఫ్టోరియో ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-1( అరబిందో )

మొక్కలు నాటిన ఎఫ్టోరియో పరిశ్రమ ప్రతినిధులు....

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటిన ఎఫ్టోరియో ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-1( అరబిందో )

సంగారెడ్డి జూన్ 9( విజన్ ఆంధ్ర హత్నూర హత్నూర మండలం బోర్పట్ల గ్రామ పరిధిలో గల ఎక్టోరియో యూనిట్-1 ప్రైవేట్ లిమిటెడ్( అరబిందో ) పరిశ్రమలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని పరిశ్రమ ప్రతినిధులు వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలను పరిశ్రమలో నాటారు. అలాగే ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా కార్మికులకు ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేసి ప్లాస్టిక్ వాడకం పై కలిగి నష్టాలను కార్మికులకు పరిశ్రమ ప్రతినిధులు వివరించారు.

సభను ఉద్దేశించి మాట్లాడిన అతిథులు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, వాయు కాలుష్యాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వినియోగానికి పూర్తిగా “నో” చెప్పాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే నేటి నుంచే స్థిరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మరియు రాష్ట్ర స్థాయి పర్యావరణ నియంత్రణ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



డా. ఎం.టి. కరుప్పయ్య.పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (వీశీజుఖీ ఱ జజ), భారత ప్రభుత్వం

కె. శ్రీనివాస రెడ్డి.జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (౧�+ూజదీ)

బి.వి. భద్ర గిరీష్.సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, టీజీపీసీబీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సంస్థ ఉద్యోగులందరూ విశేష సహకారం అందించారు. ముఖ్యంగా అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన శోభన్ బాబు, హెచ్‌ఆర్ హెడ్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ హెడ్.భవాని ప్రసాద్, తయారీ విభాగం హెడ్.ఎన్.వి.వి.రవీంద్ర, సేఫ్టీ లీడ్ శ్రీనివాస రెడ్డి.మరియు కార్పొరేట్ జుూ విభాగానికి చెందిన అమర్ కుడాలే. పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేరికపై “బడి బాట”

కాటారం, జూన్ 9 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘బడిబాట’ (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమం కాటారం మండలం చిద్నేపల్లి, దంతాలపల్లి, శ్రీనివాస్ కాలనీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. చిద్నేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బాల్నే జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దంతాలపల్లి, చిద్నేపల్లి పాఠశాలల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాల్నే జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. చిద్నేపల్లి, దంతాలపల్లి, శ్రీనివాస్ కాలనీల్లోని ఐదేళ్లు నిండిన ప్రతి బిడ్డను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మన బడులను బలోపేతం చేయాలని ఆయన ప్రజలను కోరారు. దంతాలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరివెద్ది సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో కొత్తగా ప్రీ-ప్రైమరీ (ఎల్ కే జి, యు కే జి) తరగతులను కూడా ప్రారంభించబోతున్నామని వివరించారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ బడిబాట ర్యాలీలో ఉపసర్పంచ్ కోరళ్ళ రాజయ్యతో పాటు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, కావేరి, సౌమ్య, గ్రామ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని.. కాలనీలు, వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలపై అవగాహన కల్పించారు. అర్హులైన పిల్లల వివరాలను సేకరించి, పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేశారు.

# నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి: సీపీఐ

బెల్లంపల్లి, జూన్ 9 విజన్ ఆంధ్ర కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యులు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

బెల్లంపల్లిలోని భాశెట్టి గంగారాం విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, పట్టణ



కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, కొండు బానేష్, బొల్లం తిలక్ అంబేద్కర్, కొంకుల రాజేష్, బొంకురి రామచందర్, కొండు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్పార్టీ ప్రధాన కార్యదర్శిగా బిక్షపతి నియామకం

విజన్ ఆంధ్ర హత్నూర నర్సాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హత్నూర మండలం మధుర గ్రామానికి చెందిన కుమ్మరి బిక్షపతి నియమితులయ్యారు ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి అదేవిధంగా నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీని మరింత అభివృద్ధి చేస్తానని నర్సాపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి తెలిపారు





## నాణ్యతతో పనులు పూర్తి చేయాలి: చైర్‌పర్సన్ దావ స్వాతి

బెల్లంపల్లి, జూన్ 9 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డులో మున్సిపాలిటీ గ్రాంట్ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న నూతన కల్వర్టు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, బస్తీ ప్రజలు వాహనదారులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని కల్వర్టు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, నాయకులు దావరమేష్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గర్భిణీలకు ప్రత్యేక వైద్య సేవలు

### - డాక్టర్ మౌనిక

కాటారం, జూన్ 9 (విజన్ ఆంధ్ర): గర్భిణీలకు ప్రతినెల తొమ్మిదో తారీఖున ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని కాటారం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ మంతెన మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణీలకు అందిస్తున్న సేవలను వివరించారు. గర్భిణీ కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పేర్కొన్నారు. గర్భిణీ నుంచి బాలింతల వరకు అందించాల్సిన పోషకా పోషకాహారం, ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు వాటి ప్రయోజనాలను సవివరంగా వివరించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగే విధంగా సహకరించాలని డాక్టర్ మౌనిక కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక , ల్యాబ్ టెక్నీషియన్ పుష్పలత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, వసంత, లతా, లలిత, సమ్మక్క, సంధ్య, గర్భిణీలు పాల్గొన్నారు.

# సాయినగర్ డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

బాచుపల్లి, జూన్ 9 (విజన్ ఆంధ్ర): బాచుపల్లి పరిధిలోని సాయినగర్‌లో టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ డిగ్రీ కాలేజ్ ఫర్ గర్ల్స్ సమీపంలో ఏర్పడిన డంపింగ్ యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తక్షణ స్పందన చూపారు. సమస్యపై స్థానిక నాయకులు, ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఆయన స్వయంగా ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, దోమల వ్యాప్తి, పారిశుద్ధ్య లోపాలతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సమీపంలోని బాలికల విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంత్రిని కలిసి సమస్య తీవ్రతను వివరించారు. స్థానిక ప్రజలు, విద్యార్థినుల ఆరోగ్యం దృష్ట్యా డంపింగ్ యార్డ్ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వేగంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో పాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను సమన్వయంతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాయినగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని, ఈ పర్యటన అందుకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

# తరతరాలకు స్ఫూర్తిప్రదాత స్వర్గీయ బెల్లంకొండ మల్హార్ రావు

## ఘనంగా 37 వ వర్ధంతి వేడుకలు





మల్హార్, జూన్ 09 విజన్ ఆంధ్ర : మల్హార్ మండలాభివృద్ధి ప్రదాత, స్వర్గీయ బెల్లంకొండ మల్హార్ రావు గారి 37వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని కొయ్యూర్ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన మల్హార్ రావు విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ జెడ్పీటీసీ గోనే శ్రీనివాస్ రావు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ నాడు సర్పంచ్‌గా, ఎంపీపీగా మల్హార్ రావు మండల అభివృద్ధికి బీజం వేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.నాగులమ్మ ఆలయం నుంచి మల్హారం తాడిచర్ల వరకు రోడ్ల నిర్మాణం కోసంఅధికారులను సైతం ఎదిరించి, ప్రజల అవసరాల కోసం పోరాడిన గొప్ప స్ఫూర్తిని చాటారన్నారు. 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరాటం చేసిన కొమురం భీం స్ఫూర్తితో మల్హార్ రావు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, అడవులు అడ్డంగా ఉన్నా రోడ్ల నిర్మాణం చేయించిన గొప్ప నాయకుడని కొనియాడారు.ఆ తర్వాత జరిగిన అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే జరిగిందన్నారు. మల్హార్ రావు ఆలోచనలు, ఆకాంక్షలను, ఆశయాలను మండల ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పుట్టిన వాళ్లు ఏ విధంగా ఉంటారో, ప్రజలను వాడుకునే వాళ్లు ఏ విధంగా ఉంటారో చాటి చెప్పిన నిన్నటి రోజులు చీకట్లోనే ఉంటాయని ఆయన వివరించారు. మల్హార్ రావు ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు తాజుద్దీన్, నాయకులు వాల యాదగిరి రావు, వారనాసి వరప్రసాద్, మహిళా అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, సర్పంచ్ అజ్మీరా సారక్క, నాయకులు అజ్మీరా బాలాజీ నాయక్, అన్నమనేని మధుసూదన్ రావు, డిల్లీ రాజు, అజ్మీరా సమ్మక్క, సుంకు రామన్న, ఇనుముల సతీష్, అయూబ్ ఖాన్, రావుల మొగిలి, భద్రప్ప సమ్మయ్య, శేఖర్, వెంకట్ చారి, రాజబాబు, వెంకట్, సురేష్, బూడిద సదానందం, ఇండ్ల మణి, దేవ్, రఘువరన్, మల్లేష్, పొట్ట రవి, ప్రశాంత్, మధు, శేఖర్, సురేష్ మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: కేపీ

**ఫోర్త్ సిటీ ప్రచారంలో ఉన్న నగర సమస్యలను పక్కన పెట్టారని విమర్శ**

**సుచిత్ర--కొంపల్లి ఫ్లైఓవర్ పనుల జాప్యంపై ఆగ్రహం**

**బాచుపల్లి ఫ్లైఓవర్ సహా నగర అభివృద్ధి ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని వ్యాఖ్య**

**పేర్లు మార్చడం తప్ప కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులు కనిపించడం లేదని ఆరోపణ**

**ప్రజల అవసరాల కంటే ప్రచార కార్యక్రమాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విమర్శ**



కుత్బుల్లాపూర్, జూన్ 9: (విజన్ ఆంధ్ర); హైదరాబాద్ నగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కొత్త ప్రాజెక్టుల ప్రకటనలకే పరిమితమై ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్‌ను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాచుపల్లి ఫ్లైఓవర్‌తో పాటు హైదరాబాద్ నగరంలో చేపట్టిన అనేక కీలక అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రారంభించిన పనులను పూర్తి చేసి ప్రారంభించడం మినహా కొత్తగా చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమం ఏదీ కనిపించడం లేదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించిన ఫలితంగానే బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు వేగవంతమై ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో కొత్త నగర నిర్మాణంపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తోందని, అయితే ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు, పెండింగ్ ప్రాజెక్టుల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. నగరాభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా సుచిత్ర--కొంపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయిందని ఆయన విమర్శించారు. పనుల జాప్యానికి బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం కేంద్రంపై నెపం నెట్టడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుతం హెచ్-సిటీ పేరుతో కొత్త ముద్ర వేయడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆరోపించారు. పేర్లు మార్చడం ద్వారా ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచార కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజల అవసరాలు, నగర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగర ప్రయోజనాలను కాపాడగల రాజకీయ శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ లాక్రాస్‌కు ఎంపికైన గోపికకు ఆర్థిక ప్రోత్సాహం

చేవెళ్ల, జూన్ 09 (విజన్ ఆంధ్ర): క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు సమాజం అండగా నిలిస్తే వారు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తారని చేవెళ్ల ఏసీపీ కిషన్ అన్నారు. అంతర్జాతీయ లాక్రాస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి పి. గోపికను మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిషన్ మాట్లాడుతూ... నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన గోపిక ఈ నెల 17న ఉత్తరప్రదేశ్‌లో జరిగే సెలెక్షన్ కమిటీ తుది ప్రక్రియ అనంతరం ఆస్ట్రేలియాలో నిర్వహించే అంతర్జాతీయ లాక్రాస్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారిణిని ప్రోత్సహించే ఉద్దేశంతో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజాఆగిరెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించగా, పంజాగుట్టకు చెందిన గోవర్ధన్, భోగి కార్ రాజేశ్వర్ మరో రూ.50 వేలు అందజేసి మొత్తం రూ.1 లక్షను గోపికకు అందించారు. గోపిక చేవెళ్ల ఏసీపీ కిషన్ స్వగ్రామానికి చెందిన క్రీడాకారిణి కావడం విశేషం. ఈ కార్యక్రమంలో 17 వార్డు కౌన్సిలర్ ముదవత్ కృష్ణ నాయక్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, కవ్వాడి రాజావర్ధన్ రెడ్డి, పీసరి దామోదర్ రెడ్డి, బుర్ల మహేష్ కుమార్, రవికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే సహాయ కార్యదర్శిగా గట్ల

దమ్మపేట జూన్ 09, (విజన్ ఆంధ్ర ): టి యు డబ్ల్యూ జే అశ్వరావుపేట డివిజన్ సహాయ కార్యదర్శిగా దమ్మపేట గ్రామానికి చెందిన వార్త (రూరల్) విలేకరి గట్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మంగళవారం టియుడబ్ల్యూజే (ఐజేయు) అశ్వరావుపేట డివిజన్ మహాసభ కార్యక్రమాన్ని అశ్వరావుపేట కార్యాలయంలో పీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టి యు డబ్ల్యూ జే, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారుల సమక్షంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దమ్మపేట మండలం నుండి అశ్వరావుపేట డివిజన్ సహాయ కార్యదర్శిగా గట్ల శ్రీనివాసరావు, కార్య వర్గ సభ్యుడిగా దృపతి రంజిత్ ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సీనియర్ పాత్రికేయులు ఎస్కే గోరే, చిక్కాల శ్రీనివాసరావు, మూర్తి,తోట మల్లేశ్వరరావు, అక్కం సత్యనారాయణ, బెల్లంకొండ రామారావు, గిద్ద సాయి, వినోద్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ లో కిష్టాపూర్ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

జన్నారం, జూన్ 09 (విజన్ ఆంధ్ర) : ఎన్ ఎం ఎం ఎస్ లో కిష్టాపూర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి విద్యార్థులకు భారత ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు( ఎన్ఎంఎంఎస్) నేషన ల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీమ్ కు జ న్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన12 మంది వి ద్యార్థులు ఎంపికై పాఠశాలను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలబెట్టినట్లు మంగళవారం రోజున పాఠ శాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పాఠశాలలో దాదాపు 300 మంది విద్యా ర్థులు ఎంపికై జాతీయ స్థాయి రికార్డు సృష్టించారని ఎంపికైన వారిలో ముత్యం ఆహ్వానిత వర్మ, జక్కు ల మనీష్, కర్నే శ్రీ కృతి, జాడి నవదీప్, కుదురుపా క ఉదయ్ చరణ్, చెట్పెల్లి ఆరాధ్య, నక్క విష్ణు, ఉ దుతల ఉదయ్, తేజావత్ ఋషి వర్ధన్, పోతు రు శివాసల శ్రీహర్ష, చాట్ల రిషి వర్ధన్ లు వున్నారని వీరికి ప్రతి సంవత్సరానికి 12 వేల రూపాయల ఉ పకార వేతనం నాలుగు సంవత్సరాల వరకు భార త ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సంద ర్భంగా స్కాలర్ షిప్ కు ఎంపికైన విద్యార్థులను జి ల్లా విద్యాశాఖ అధికారి లలిత, పాఠశాల ప్రధానో పాధ్యాయులు గుండ రాజన్న, గ్రామ సర్పంచ్ వా సాల నరేష్,మం డల విద్యాధికారి విజయ్ కుమా ర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ, ఉపాధ్యా యులు జాడి మురళి, దాముక కమలాకర్, గోవర్ధ న చారి, కొట్టే రాజన్న, ఆర్. బుచ్చి లింగయ్య ,ప్రకా ష్ బానవత్, నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, వాసు, కాంతయ్య, శ్రీనివాస్, రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న,కృష్ణమూర్తి, మరి యు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యామ్నాయ గోదాం ఏర్పాటు

దౌల్తాబాద్,జూన్ 9 (విజన్ ఆంధ్ర): యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో హైమద్ నగర్ మిల్లుల్లో స్టోరేజ్ సామర్థ్యం పూర్తిగా నిండిపోవడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. దీని భాగంగా రాయపోల్ మండలం రామారం శివారులోని మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో తాత్కాలిక గోదాం ఏర్పాటు చేసి ధాన్యం దిగుమతి చేసుకునే ఏర్పాట్లు చేశారు. ఈ నిర్ణయంతో దౌల్తాబాద్, రాయపోల్ మండలాల రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే అవకాశం కలిగిందని తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్



కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు, మాచిన్‌పల్లి సర్పంచ్ నాగరాజు, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు

### - మండల వ్యవసాయ అధికారివేల్పుల పూజ

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 9 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులలో స్టాక్ బుక్కులను తనిఖీ చేశారు.తనిఖీల సందర్భంగా డీలర్లకు పలు సూచనలు జారీ చేశారు.రైతులకు నాణ్యమైన సన్న రకం వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాల విక్రయం లేదా ఎరువులు,పురుగుమందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా ప్రతి షాపులో స్టాక్ బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ నిబంధనలను ఉల్లంఘించే



డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులను కూడా రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# గిరిజన యువతకు ఉపాదే లక్ష్యంగా విద్యా బోధన

### -- క్రమశిక్షణ ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా... ప్రభుత్వ కళాశాల
### -- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు...



కారేపల్లి,జూన్ 10(విజన్ ఆంధ్ర) ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా క్రమశిక్షణలో మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాణిస్తుండడం హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపల్ ఎన్ విజయ కుమారీ అన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..తాను కళాశాల బాధ్యతలు చేపట్టినప్పటినుండి కళాశాలను అత్యున్నతంగా తీర్చిదిద్దామని అన్నారు.వర్షాకాలంలో గదులలో వర్షపు నీరు చేరుతూ,పై స్లాబ్ సైతం పెచ్చులూ డుతూ ప్రమాదానికి దారి తీసే విధంగా ఉందని, విషయాన్ని వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ కు తెలియపరచి,పలుమార్లు కళాశాల పరిస్థితిని వివరించడంతో 50 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు.ఈ నిధులతో కళాశాలను వీలైనంతలో అత్యాధునికంగా తీర్చిదిద్దామని అన్నారు.కార్పొరేట్ కళాశాలకు ధీటుగా పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, పోటీ పరీక్షల పుస్తకాలను సైతం విద్యార్థులకు అందజేశామన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణలోను రాణిస్తేనే భవిష్యత్తు బాగుంటుందనే ఆలోచనతో కొన్ని కఠిన నిబంధనలు సైతం అమలు పరచడంతో పరీక్షల ఫలితాలలో విద్యార్థుల ముఖంలో చిరునవ్వులను చూడగలిగామన్నారు.ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ..పరీక్షల సమయంలో అల్పాహారాన్ని అందిస్తూ ఫ్రెండ్లీ వాతావరణాన్ని తలపిస్తూ విద్యార్థులకు దిశా నిర్దేశాన్ని చేయగలిగామన్నారు. ప్రైవేటు కళాశాల విద్యార్థుల పోటీ తత్వాన్ని గుర్తిస్తూ దానికి దీటుగా డిజిటల్ టీవీలు,ప్రొజెక్టర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా శిక్షణా తరగతులను ఏర్పాటు చేసి మెరుగైన బోధనను అందిస్తున్నామన్నారు. ఐటీడీఏ ద్వారా కల్పిస్తున్న మౌలిక సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని గిరిజన ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు.తమ విద్యార్థులు ఇంజనీరింగ్ వ్యవసాయం,ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో అత్యంత పోటీతో కూడిన రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లో అత్యధిక ర్యాంకులు సాధించారన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అడ్మిషన్ క్యాంపెయినింగ్ డిసెంబర్ నెల నుంచి తమ అధ్యాపక బృందంతో ప్రారంభించామని, మండలంలోని అన్ని గ్రామాలలో తిరుగుతూ పదవ తరగతి విద్యార్థులను,వారి తల్లిదండ్రులను కలిసి కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ..విద్యార్థులపై తమ భరోసాను,బాధ్యతను కల్పించామన్నారు.ఈ క్యాంపైన్ లో భాగంగా స్థానిక సర్పంచులు, ఎంపీడీవో నీ కలిసి వారి సలహా సూచనలతో ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశామన్నారు.కళాశాల అభ్యున్నతికి తమ ఉపాధ్యాయులు నిరంతరం చేస్తున్న కృషి అభినందనీయమని,తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ కళాశాలను జిల్లాలో అగ్రగామిక నిలపడమే తమ ప్రధాన లక్ష్యం అని అన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి..

### జడ్జి స్వరూప కాటం వెల్లడి..



ఇల్లందు, మే 9(విజన్ ఆంధ్ర) ఈ మంగళవారంనాడు స్థానిక ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు సాయంత్రం ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ఇల్లందు కోర్టు పరిధిలో గల వివిధ పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లతో కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జడ్జి స్వరూప కాటం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ.. ఈనెల 20న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా అందరూ ఎస్. హెచ్. ఓ. లు బాధ్యతగా సహకరించి రాజి పడదగిన కేసులను ఇరువర్గాల సమన్వయ పరిచి, ఆయా స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించి, పెద్ద మొత్తంలో కేసులు రాజీ పడే విధంగా కృషి చేసి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు, కోర్టు సూపరిడెంట్ రామకృష్ణ, ఇల్లందు కోర్టు పరిధిలోగల పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లు కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### - ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్, జూన్ 09, (విజన్ ఆంధ్ర) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో బాగంగా ఈరోజు ఉట్నూర్ అటవీ శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి నీ కాపాడడం ప్రజలందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను పెంచడం వల్ల ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు అవుతారని. కర్ణాటక లోని బందిపూర్ టైగర్ రిజర్వ్ తరహా వన్య ప్రాణులను పెంచాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రకృతిని రక్షిద్దాం అని ఎమ్మెల్యే బోజ్జు పిలుపునిచ్చారు.

## శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో పూజా సామగ్రి విక్రయాల వేలం...

బోధన్, జూన్ 09 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో దేవస్థానానికి సంబంధించిన కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయాల హక్కులను ఒక సంవత్సరం కాలపరిమితితో కిరాయి ఒప్పందం ద్వారా కేటాయించేందుకు ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు 5,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు, భక్తులు నిర్ణీత సమయంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ వేలం ప్రక్రియను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజలకు నిత్యం అందుబాటులో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### శుభకార్యాలకు ఆహ్వానించిన ప్రజాప్రతినిధులు, నాయకులు -- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్, జూన్ 9 (విజన్ ఆంధ్ర); ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఎల్పీ విప్, కేపీ వివేకానశీద్ ను మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాస కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళు ,, అభిమానులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ కుటుంబాల్లో నిర్వహించనున్న వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అందరి ఆహ్వానాలను స్వీకరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆప్యాయంగా పలకరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సుఖదుఃఖాల్లో భాగస్వామిగా నిలుస్తున్న ఎమ్మెల్యేను కలిసిన వారు ఆయన సేవా తత్వాన్ని అభినందించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# హైదరాబాద్--ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గం జహీరాబాద్ మీదుగానే సాగాలి

### - మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు వినతి
### - స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ



జహీరాబాద్ జూన్ 09 (విజన్ ఆంధ్ర): జహీరాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా ప్రతిష్టాత్మక హైదరాబాద్--ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు మార్గాన్ని జహీరాబాద్ మీదుగా కొనసాగించాలని కోరుతూ 27వ వార్డు కౌన్సిలర్ నామ ప్రవంతి రవికిరణ్ నేతృత్వంలోని బృందం మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. జహీరాబాద్ పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, నిమ్జ్ వంటి భారీ ప్రాజెక్టులు ఏర్పడుతున్న నేపథ్యంలో అత్యాధునిక రవాణా సదుపాయాలు అత్యవసరమని వారు పేర్కొన్నారు. గతంలో బీబీ పాటిల్ ఎంపీగా ఉన్న సమయంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో జహీరాబాద్‌ను స్టేషన్‌గా చేర్చేలా కృషి చేశారని గుర్తు చేశారు. అయితే తాజాగా రూపొందించిన డీపీఆర్‌లో మార్పులు చేసి మార్గాన్ని వికారాబాద్ వైపు మళ్లించడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిని స్వీకరించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఈ అంశాన్ని కేంద్ర రైల్వే మంత్రి మరియు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. డీపీఆర్‌లో తగిన మార్పులు చేసి బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని తిరిగి జహీరాబాద్ మీదుగా వెళ్లేలా, అలాగే ఇక్కడ ఆధునిక రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, రాచయ్య యాదవ్, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 15 మంది ఎస్ఐల బదిలీలు

కాటారం, జూన్ 9 (విజన్ ఆంధ్ర): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 15 మంది సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లు బదిలీ అయ్యారు. ఈ మేరకు కాలేశ్వరం జోన్ వన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి డి.ఎస్.బి లో పనిచేస్తున్న సిహెచ్ శ్రీనివాస్ ను కాటారం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా బదిలీ చేశారు. అలాగే వీఆర్ లో ఉన్న జే మహేష్ కాటారం పిఎస్ ఎస్సై టు గా పోస్టింగ్ చేశారు. మహా ముత్తారం పిఎస్ ఎస్ హెచ్ ఓ గా ఉన్న పీ మహేందర్ కుమార్ ను కొయ్యూరు పిఎస్ ఎస్ హెచ్ ఓ గా, విఆర్ లో ఉన్న ఏ కళ్యాణ్ ను కొయ్యూరు ఎస్సై 2 గా బదిలీ చేశారు. అలాగే భూపాలపల్లి పిఎస్ ఎస్సై 2 గా ఉన్న జీ రమేష్ ను మహాముత్తారం పిఎస్ ఎస్ హెచ్ ఓ గా నియమించారు. వి ఆర్ లో ఉన్న టి సాయి శశాంక్ ను పలిమల పిఎస్ ఎస్ హెచ్ ఓ గా నియమించారు. భూపాలపల్లి పిఎస్ ఎస్ ఐ 1 ఎం సాంబమూర్తిని మహాదేవపూర్ పిఎస్ ఎస్ హెచ్ ఓ గా పోస్టింగ్ ఇచ్చారు. పలిమెల పిఎస్ ఎస్ హెచ్ ఓ గా ఉన్న జే రమేష్ ను మహాదేవపూర్ పిఎస్ ఎస్సై 2 గా నియమించారు. మహాదేవపూర్ పిఎస్ ఎస్ హెచ్ ఓ గా ఉన్న కే పవన్ కుమార్ ను భూపాలపల్లి పి ఎస్ ఎస్సై వన్ గా బదిలీ అయ్యారు. భూపాలపల్లి విఆర్ లో ఉన్న వి రాజన్ కుమార్ ను చిట్యాల పిఎస్ ఎస్ఐ టు గా బదిలీ చేశారు. అలాగే కొయ్యూరు పిఎస్ ఎస్ హెచ్ ఓ గా ఉన్న వి నరేష్, విఆర్ లో ఉన్న ఆర్ అశోక్, ఎ శ్రీనివాస్, ఈ సురేష్ లను డి.ఎస్.బికి బదిలీ చేశారు. చిట్యాల పిఎస్ ఎస్ఐ టు గా ఉన్న ఎండి షాక్ ఖాన్ ను వి ఆర్ కు బదిలీ చేశారు.

## యాప్ ఆధారిత ఎరువుల విక్రయ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

### – రైతు ఎన్ను గోవర్ధన్ రెడ్డి



చేవెళ్ల, జూన్ 09 (విజన్ ఆంధ్ర): యాప్ ఆధారిత ఎరువుల విక్రయ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి అని చేవెళ్ల మున్సిపల్ ఇబ్రహీంపల్లి వార్డుకు చెందిన రైతు ఎన్ను గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్లలో 'విజన్ ఆంధ్ర'తో మాట్లాడుతూ... ఫర్టిలైజర్ దుకాణాల గోదాముల్లో తగినంత ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ రైతుల చేతికి ఒక్క సంచి కూడా సకాలంలో అందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. యాప్ ద్వారా బుకింగ్ తప్పనిసరి చేయడంతో పలువురు రైతులు నమోదు చేసుకోలేకపోతున్నారని, స్మార్ట్‌ఫోన్ లేని వారికి ఎరువులు పొందడం మరింత కష్టంగా మారిందని వివరించారు. యాప్ ద్వారా నమోదు అయినా ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇవ్వడం పంట అవసరాలకు ఏమాత్రం సరిపోదన్నారు. యాప్ లేకుండా ఎరువులు విక్రయించలేని పరిస్థితితో ఫర్టిలైజర్ దుకాణదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాగు పనులు కీలక దశలో ఉన్న సమయంలో ఇలాంటి విధానం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని, తక్షణమే యాప్ ఆధారిత విక్రయాన్ని నిలిపివేసి సాధారణ పద్ధతిలో ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అల్లోల్--భారత్ నగర్ రహదారి పనులపై ఆర్టీఐ దాఖలు



- నిధులు, టెండర్లు, ఖర్చుల వివరాలు వెల్లడించాలని డిమాండ్

జహీరాబాద్ జూన్ 09 (విజన్ ఆంధ్ర): అల్లోల్--భారత్ నగర్ రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి మంజూరైన నిధులు, టెండర్ ప్రక్రియ, వర్క్ ఆర్డర్లు, ఖర్చు వివరాలు, బిల్లులు మరియు పనుల పురోగతిపై పూర్తి సమాచారాన్ని కోరుతూ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎర్రుల అశోక్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు సమర్పించారు. మంగళవారం జహీరాబాద్ రోడ్లు మరియు భవనాల (ఆర్&బీ) శాఖ కార్యాలయంలో ఆయన ఈ దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రుల అశోక్ మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో చేపట్టే అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. అల్లోల్--భారత్ నగర్ రహదారి పనులకు సంబంధించిన అధికారిక వివరాలను ప్రజల ముందుకు తీసుకురావడమే ఆర్టీఐ దాఖలు వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆర్టీఐ ద్వారా లభించే సమాచారాన్ని ప్రజలకు వెల్లడించి, అవసరమైతే తదుపరి కార్యాచరణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. రహదారి అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తి సమాచారం అందించడం ద్వారా పారదర్శక పాలనకు తోడ్పాటునందించాలన్నదే తమ లక్ష్యమని ఎర్రుల అశోక్ పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ నర్సింలును పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్ జూన్ 09 (విజన్ ఆంధ్ర): ఝరాసంగం మండల రిపోర్టర్ రాయికోటి నర్సింలును బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం పరామర్శించారు. మాజీ మండల అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, కుప్పానగర్ జి. నర్సింలు, ఝరాసంగం మండల అధ్యక్షుడు ఏజాజ్ బాబా, జహీరాబాద్ సీనియర్ నాయకుడు గోట్టిగారిపల్లి భూమన్న తదితరులు జహీరాబాద్‌లోని నర్సింలు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌కు మొబైల్ ఫోన్ ద్వారా సమాచారం అందజేయగా, ఆయన నర్సింలుతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ నర్సింలుకు ఉత్సాహాన్ని నింపారు. జర్నలిస్టు నర్సింలు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని నాయకులు ఆకాంక్షించారు.

# ఎన్నికల కమిషన్ ముసుగులో కేంద్ర ప్రభుత్వం ఓటర్లను తొలగించే కుట్ర

--ఎస్ ఐ ఆర్ (సార్) రాష్ట్ర కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి.

--ఓట్ల తొలగించే కుట్రలను అడ్డుకుంది బాధ్యత మనదే

--తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.

--తాండూర్ లొ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ శిక్షణ కార్యక్రమం విజయవంతం.




తాండూరు, జూన్ 9 (విజన్ ఆంధ్ర): ఎన్నికల కమిషన్ ముసుగులో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ ఓటర్లను తొలగించే కుట్ర చేస్తుందని ఎస్ ఐ ఆర్ రాష్ట్ర కన్వీనర్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు నియోజకవర్గం సర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు పర్యవేక్షణలో పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సర్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీ.రామ్మోహన్ రావు తెలంగాణ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) చైర్మన్‌గా దూడం వెంకట రమణ, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్వీనర్ టీ. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమీషన్ ముసుగులో అర్హులను ఓటర్లను తొలగించేందుకు సర్ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ఓటర్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ కుట్రలను అడ్డుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలపై ఉందని అన్నారు. సర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేయాలన్నారు. బీఎల్ఏలు, ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్తగా ఓటర్ల నమోదును కూడా చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వేలో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా రాజ్యాంగ బద్ధంగా వచ్చిన నిజమైన ఓటు హక్కును తొలగించేందుకు అధికారం లేదని అన్నారు. సర్ కార్యక్రమం ద్వారా ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలకు సూచించారు. అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందని అన్నారు. కొత్త ఓటర్ల నమోదు, డబుల్ ఓటర్ల తొలగింపుకు కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పనిచేయాలని అన్నారు. ఈనెల 25నుంచి వచ్చేనెల జులై 24వ తేది వరకు బీఎల్ఓలతో పాటు బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేయాలన్నారు.మరోవైపు సర్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దూడం వెంకట రమణ ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించి.. సర్ కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమానికి బీఎల్ఏలు, నేతలు భారీగా హాజరవడంతో కార్యక్రమం విజయవంతం అయింది. ఈ కార్యక్రమంలో పందురు నియోజకవర్గంలోని 269 బూత్‌ల బి ఎల్ ఏ లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ మరియు మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలి: గ్రామ సర్పంచ్ పావనిచెన్నయ్య

షాబాద్, జూన్ 09 (విజన్ ఆంధ్ర): గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు డంపింగ్ యార్డుల ఏర్పాటు అత్యవసరమని, ఇందుకోసం తగిన స్థలాన్ని వెంటనే కేటాయించాలని గ్రామ సర్పంచ్ పావనిచెన్నయ్య కోరారు. షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాలని మండల తహశీల్దార్ ఎం.డి. అన్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత కొన్ని నెలలుగా గ్రామంలో సేకరించే చెత్తతో పాటు ఇతర వ్యర్థాలను పారబోయడానికి ప్రత్యేక స్థలం లేక పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గ్రామ పరిధిలోని పెరుమల కుంట ప్రాంతాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆ స్థలాన్ని కేటాయిస్తే గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వివరించారు. తమ వినతిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి, స్థల కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తామని తెలిపినట్లు గ్రామ సర్పంచ్ పావనిచెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు విజయ లక్ష్మీ రెడ్డి, కలమ్మ, గ్రామస్తులు ఏకాంబరం రెడ్డి, ఆంజనేయులు, రాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ..

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి..

ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్..

నానో యూరియా వినియోగాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించండి..

రైతులకు అవగాహన..



బోధన్, జూన్ 09 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లి లో గల ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపి, యాప్ వల్ల సమకూరే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని అన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 27 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. ఒకింత ముందుగానే పంటలు విత్తుకునే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని, తదుపరి నిజామాబాద్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలో కూడా పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ చైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



# గ్రామ దేవతకు మొక్కులు

ముధోల్:జూన్09:విజన్ ఆంధ్ర ఈయేడు వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని అడెల్లి పోచమ్మ (గ్రామ దేవత) కు ఊరు పండుగను ముధోల్ మండల కేంద్రానికి చెందిన రైతులు, గ్రామస్తులు పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు. ముందుగా ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో అడెల్లి పోచమ్మ (గ్రామదేవత) కు మహిళలు బోనాలతో ఇంటి నుండి వండిన పిండి వంటకాలు నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి మేకలను బలి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు గ్రామ దేవతకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారి కి కోరుకున్నామన్నారు. దీంతో మంగళవారం కుల సంఘాల ఆధ్వర్యంలో ఊరు పండుగ నిర్వహించడంతో పండుగ వాతావరణం ఏర్పడింది.

# తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి చిరస్మరణీయ నివాళి

**- ఘట్కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు,**

**- స్మృతి వనం పనులను పరిశీలించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 9, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు.

అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ,స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు.

స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

## ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఉద్యోగాలకు

# దరఖాస్తుల ఆహ్వానం



చారకొండ, జూన్ 9 (విజన్ ఆంధ్ర): ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో పని చేయుటకు ఇన్ స్ట్రక్టర్, ఆయాలను నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఝాన్సీరాణి మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని చారకొండ ప్రాథమిక పాఠశాలతో పాటు జూపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రీ- ప్రైమరీ పాఠశాలకు కేటాయించినట్లు చెప్పారు. చారకొండ ప్రాథమిక పాఠశాల ఓసీకి, జూపల్లి ప్రాథమిక పాఠశాల ఎస్సీ-1కి రిజర్వుడు చేసినట్లు వివరించారు. ఇన్ స్ట్రక్టర్ ఇంటర్మీడియట్ పాటు టీచర్ ఎడ్యుకేషన్ అర్హత ఉండాలని, ఆయాలకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. ఈనెల నేటి నుండి 15 వరకు మర్రిపల్లిలోని ఎమ్మార్సీ భవనంలో ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 09: కుత్బుల్లాపూర్‌కు చెందిన దస్తగిరి ప్రమాదంలో తన కుడి కాలును కోల్పోయి చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా కష్టాలు పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ వెంటనే స్పందించారు. దస్తగిరికి అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించి, కృత్రిమ కుడి కాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. శివకృష్ణ చొరవతో దస్తగిరికి కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి న్యూ శక్తి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి, జవహర్‌నగర్ బలగంటి సీతవో చింతల విజయ్ కుమార్, జినుక రఘు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్పల్లి భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర , సంధ్య, టెక్నీషియన్ రఘు, మధు, స్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు



శివకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు వికలాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు.

# కాళేశ్వరంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం

## జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం: జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్

భూపాలపల్లి జిల్లా (కాళేశ్వరం,) 09 జూన్ (విజన్ ఆంధ్ర) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, సంఘం బలోపేతమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంలో జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్‌కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు.




జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్‌కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.

అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 29న భూపాలపల్లిలో నిర్వహించనున్న జిల్లా మాససభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సట్ల మురళి, ఎంఎల్ఎన్ మూర్తి, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మూబిన్, టేన్జ్ అధ్యక్షుడు సాంబయ్య, రజనీకాంత్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమ సాధన దిశగా ఈ సమావేశం ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# దళితుల భూములపై కన్నేస్తే ఊరుకోం

## 49 ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూమికి రక్షణ కవచం, సర్వే పూర్తయ్యాక ఫెన్సింగ్, కబ్జాదారులపై కఠిన చర్యలు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 9, (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, 1991లో గుండ్లపోచంపల్లి శివారు సర్వే నంబర్ 509లోని 49 ఎకరాల 20 గుంటల భూమిని దళిత విద్యార్థుల సంక్షేమం, శిక్షణా కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించారని తెలిపారు. తెలంగాణకు చెందిన ఎస్సీ విద్యార్థులకు ఉద్యానవన శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన ఈ విలువైన భూమిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు గత ప్రభుత్వ అండదండలతో, ఆర్థిక బలాన్ని ఉపయోగించి అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. దళితుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. 49 ఎకరాల 20 గుంటల భూమికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందిన వెంటనే పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. "అన్యాక్రాంతం చేస్తున్న వారిలో ఎంత పెద్దవారు ఉన్నా సహించేది లేదు. ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని రక్షిస్తాం" అని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని వెంటనే సర్వే నిర్వహించాలని, హద్దురాళ్లు, గేట్లు ఏర్పాటు చేసి భౌతిక స్వాధీన స్థితిపై నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం భూమిని పూర్తిస్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా బాధ్యతతోనే తాను ఇక్కడికి వచ్చానని పేర్కొన్న మంత్రి, దళితుల ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదన్నారు.

బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రభావాలకు ప్రభుత్వం భయపడదని, మాటల్లో కాదు చేతల్లో చూపిస్తామని హెచ్చరించారు.

"దళిత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే మా లక్ష్యం. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఈ 49 ఎకరాల 20 గుంటల భూమి సాధారణ ఆస్తి కాదు. దీనిని కాపాడటం సామాజిక బాధ్యత" అని మంత్రి పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో ఎవరైనా చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయడానికి ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. "49 ఎకరాల 20 గుంటల్లో ఒక్క గజం భూమి పోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని హెచ్చరించారు.

అదే సమయంలో ఆ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తామని తెలిపారు.

రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా రైతులను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, తమ ప్రభావాన్ని చూపాలని భావించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి కూడా నివేదిక సమర్పించి భూముల రక్షణకు అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి బి. శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. శంకర్, మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ, మేడ్చల్ తహసీల్దార్ (ఇన్‌చార్జి) అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన ఎస్ బి వి ఆర్ కళాశాల విద్యార్థులు

బద్వేలు, జూన్ 9(విజన్ ఆంధ్ర) బద్వేల్ పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న వివిధ కళాశాలల విద్యార్థులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఎస్ బి వి ఆర్, బిఈడి, మరియు బిపిఈడి కళాశాలలో ప్రిన్సిపాల్ డా,, యు శ్యాంసుందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా,, కే వెంకటసుబ్బారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు జూన్ నెల మూడో తేదీ నుండి 8వ తేదీ వరకు చెన్నైలోని హిందుస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్షిప్ పోటీలలో ఎస్ బి వి ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రేరణ, ఆర్ సెల్వి 69 కేజీల విభాగంలో మొత్తం 560 కేజీల బరువు




ఎత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నార్నన్నారు అదేవిధంగా ఎస్ బి వి ఆర్ బీఈడీ కళాశాల విద్యార్థి దోనే మురళీకృష్ణ 59 కేజీల విభాగంలో మొత్తం 640 కేజీల బరువు ఎత్తి రజక పథకాన్ని కైవసం చేసుకున్నార్నన్నారు బీపీఈడి కళాశాల విద్యార్థి సయ్యద్ ఖాజావలి 93 కేజీల విభాగంలో మొత్తం 835 కేజీల బరువు ఎత్తి రజక పథకం సాధించారన్నారు జాతీయస్థాయిలో ఎస్ బి వి ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను బిజీ వేముల వీరారెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ రితీష్ కుమార్ రెడ్డి విద్యార్థులను అభినందించారు అదేవిధంగా పతకాలు సాధించడానికి కారణమైన కళాశాల ప్రిన్సిపల్ లను మరియు అధ్యాపక సిబ్బందిని ఘనంగా అభినందించారు అలాగే పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా అభినందించారు

## జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్

వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్09(విజన్ ఆంధ్ర); తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా 2026 జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. సంబంధిత శాఖలు, అధికారులు మరియు న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గరిష్ట సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్09(విజన్ ఆంధ్ర);ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు వరంగల్ ఐఎంఏ హాల్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో బయోమెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కీలకమని అన్నారు. ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, నిర్దేశిత రంగుల కవర్లు, డబ్బాల్లో నిల్వ చేయడం, సురక్షితంగా తరలించి నిర్వీర్యం చేయడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా పాటించాలని, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు వ్యక్తిగత భద్రతా చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, రంగుల వారీగా వ్యర్థాల నిల్వ, సేకరణ, రవాణా, నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల గురించి సవివరంగా వివరించారు.

పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగుల కవర్లు, డబ్బాల్లో వేర్వేరు రకాల వ్యర్థాలను వేరు చేసి నిల్వ చేయాల్సిన విధానం, పదునైన వ్యర్థాల నిర్వహణ, సోడియం హైపోక్లోరైట్ వినియోగం, వ్యర్థాల సురక్షిత నిల్వపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో వ్యర్థాలు ఎక్కువసేపు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీత, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా అధికారులు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నరేష్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎనుమాముల మార్కెట్ యార్డును సందర్శించిన జిల్లా కలెక్టర్

వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్09(విజన్ ఆంధ్ర); కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక జిల్లా కలెక్టర్‌కు పూల బొకేతో స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డులోని పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ జనార్ధన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో పర్యటించిన శిక్షణ ఐఏఎస్ లు



జన్నారం, జూన్ 09 (విజన్ ఆంధ్ర) : కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో శిక్షణ ఐఏఎస్ లు పర్యటించారు. తెలంగాణ దర్శన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్ ఐఎఎస్ శిక్షణాధికారులు ఇ.సాయి శివాని, సచిన్ బసవరాజ్, పి.హరి ప్రసాద్, సురేష్ పామూరి లు మంగళవారం రోజున కవాల్ టైగర్ రిజర్వ్ లోని జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టైగర్ రిజర్వ్ లోని సఫారీ మార్గంలో వన్యప్రాణులను వీక్షిస్తూ, బర్డ్ వాచింగ్ లో పాల్గొన్నారు. జన్నారం, తాళ్లపేట అటవీ రేంజ్ ల పరిధిలోని మల్యాల వాచ్ టవర్, బైసన్ కుంట, నీలుగాయి సోలార్ కుంటలను దర్శించారు. కవ్వా టైగర్ రిజర్వ్ లో ఉండే వివిధ వృక్ష, జంతుజాలం గురించి, అటవీ, వన్యప్రాణి సంరక్షణలోని సవాళ్లు, సమస్యల గురించి, ఎకో టూరిజం కార్యక్రమం గు రించి అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి రాము వారికి వివరించా రు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది భోజ, శ్రీకాం త్, అజీజ్ తదితరులు ఉన్నారు

# రెవెన్యూ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

## ఆర్డీఓ రవీందర్

మల్హార్, జూన్ 9 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచెర్ల లోని తహసీల్దార్ కార్యాలయంలో కాటారం ఆర్డీఓ డి రవీందర్ తహసీల్దార్ కె. రవికుమార్, కార్యాలయ సిబ్బంది మరియు జీపీఓ లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాదబైనామ మరియు రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ప్రజా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెనువెంటనే క్షేత్రస్థాయి విచారణ జరపాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం విచారణ పూర్తి చేసి, వీలైనంత త్వరగా నివేదికలను సమర్పించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలోనే బి,ఎల్ ఏ,ల నియామకం, శిక్షణ

**- పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే క్రమశిక్షణా చర్యలు**

**- టిడిపి జోనల్ ఇంచార్జ్ పెళ్ళకూరి శ్రీనివాసన్ రెడ్డి**

**- నియోజకవర్గ పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర**





బద్వేలు, జూన్ 9:( విజన్ ఆంధ్ర)బద్వేలు నియోజకవర్గంలో బిఎల్ఏ ల నియామకం, శిక్షణ బాధ్యతలు డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి అప్పగిస్తూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఇవ్వడం జరిగిందని టిడిపి జోనల్ ఇంచార్జ్ పెళ్ళకూరి శ్రీనివాసరెడ్డి, బద్వేలు నియోజకవర్గం పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బద్వేలు నియోజకవర్గంలో పార్టీ తరపు బి ఎల్ ఏ ల (బూత్ లెవెల్ ఏజెంట్లు) నియామకం, వారికి శిక్షణ ఇవ్వడం, పర్యవేక్షించడం తదితర బాధ్యతలను కడప డీసీసీబీ చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి పూర్తిస్థాయిలో అప్పగించడం జరిగింది అని అన్నారు,ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుండి అధికారిక ఉత్తర్వులు జారీ చేయబడగా, వాటిని బద్వేలు నియోజకవర్గ ఎన్నికల అధికారి( ఆర్డీవో) కి కూడా అందజేయడం జరిగింది.

అందువల్ల బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బి ఎల్ ఏ ల శిక్షణ కార్యక్రమాలు, ఎన్నికల ప్రక్రియ (ఎస్ ఐ ఆర్) సంబంధించిన సమావేశాలు మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మాత్రమే అధికారికంగా నిర్వహించబడతాయి అన్నారు. ఇది తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయమని తెలియజేస్తున్నాము అని తెలియజేశారు.కావున నియోజకవర్గంలోని క్లస్టర్ ఇంచార్జ్‌లు, కో-క్లస్టర్ ఇంచార్జ్‌లు, బి ఎల్ ఏ లు, యూనిట్ ఇంచార్జ్‌లు, బూత్ ఇంచార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సూర్యనారాయణ రెడ్డి నిర్వహించే సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

అలాగే పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా ఎవరూ ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని, అటువంటి సమావేశాలకు పార్టీ కార్యకర్తలు హాజరుకావద్దని సూచించారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి స్వంత అజెండాలతో సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తలను తప్పుదోవ పట్టించే వారిపై పార్టీ తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలు మంచూరు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలోనే నిర్వహించబడేలా పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్న విషయాన్ని మరోసారి తెలియజేస్తున్నాము అని తెలుగుదేశం పార్టీ జోనల్ ఇంచార్జ్ పెళ్ళకూరి శ్రీనివాసన్ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర తెలియజేశారు.

# ఎరువుల దుకాణంలో ఏంఏవో ఆకస్మిక తనిఖీ

మాగనూరు మే 9 (విజన్ ఆంధ్ర) మాగనూరు మండలం మాగనూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అగ్రోస్ ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) సుదర్శన్ గౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో నిల్వ ఉంచిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సు పత్రాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, ఏవైనా నాణ్యతా సమస్యలు తలెత్తినప్పుడు అవే ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ రైతుల ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

# ఖమ్మంలో కామాంధుడి ఘాతుకం ...

**- బాలికపై లైంగిక దాడి**

**- బాలికను మూడంతస్తుల బిల్డింగ్ పైనుంచి తోసేసిన కామాంధుడు గౌస్**

**- తీవ్ర గాయాలయి ... చావుఅంచున బాలిక**

ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 9 (విజన్ ఆంధ్ర) : కఠిన చట్టాలను ఎన్ని తీసుకు వచ్చినా కామాంధుల కోరల్లో చిన్నారులు బలవుతూనే ఉన్నారు . ఒక చిన్నారిపై లైంగికదాడి చేయడమే కాకుండా, విషయం బయటకు వస్తుందనే ఉద్దేశంతో మూడంతస్తుల బిల్డింగ్ పై నుండి కిందకు పడేసి చంపేందుకు ఒక కామాంధుడు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది .

ఖమ్మం జిల్లా కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు ఆపై ఆ బాలికను చంపేందుకు యత్నించాడు. ఖమ్మం నగరంలోని ఓఅపార్ట్ మెంట్ లో వాచ్ మెన్ గా పనిచేస్తున్న తాత వద్దకు వేసవి సెలవుల కోసం వచ్చిన బాలికపై అదే అపార్ట్ మెంట్ లో నివాసముంటున్న గౌస్ (49) కన్నేసాడు. అదును చూసి ఆడుకుంటున్న బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు వెల్లడిస్తుందేమోనన్న ఆలోచనతో గౌస్ అపార్ట్ మెంట్ పైనుండి బాలికను క్రిందకు పడేసాడు. అందరూ ఆడుకుంటూ క్రింద పడిందని అనుకున్నారు . తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పించారు కుటుంబసభ్యులు .

బిల్డింగ్ పై నుండి పడడంతో బాలిక గాయాలపాలయ్యింది . చేతులు, కాళ్ళు, వెన్నుపూస, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. చావు బ్రతుకుల మధ్య పోరాడుతూ రెండు రోజుల చికిత్స అనంతరం బాలిక స్పృహలోకి వచ్చింది . అనంతరం బాలిక చెప్పిన విషయాలతో కుటుంబ సభ్యులు విస్తుపోయారు . అపార్ట్ మెంట్లో ఉన్న అంకుల్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తనను పైనుంచి క్రిందకు పడేసాడని కుటుంబసభ్యులతో బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. అనంతరం బాధిత బాలిక కుటుంబసభ్యులు ఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాధు చెసారు.

ఘటనపై ప్రాథమిక విచారణ జరిపి నిందితుడిపై పోక్సో, అటెంప్ట్ టూ మర్డర్ కింద పోలీసులు కేసు నమోదు చేసారు .

ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బాధిత బాలికకు చికిత్స కొనసాగుతుంది .

స్పందించిన మంత్రి పొంగులేటి

– బాధితురాలికి 'నిమ్స్'లో అత్యున్నత వైద్యం.. నిందితుడికి కఠిన శిక్ష తప్పదు

ఖమ్మం నగరంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్యాయత్నం ఘటనపై తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఆ కఠినాత్ముడిని చట్టపరంగా అత్యంత కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. జరిగిన ఈ ఘాతుకం తనను తీవ్రంగా కలచివేసిందని, నిందితుడిపై తక్షణమే కఠిన చట్టాల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

– బాధితులకు పూర్తి అండ..

విషయం తెలిసిన వెంటనే మంత్రి పొంగులేటి బాధిత బాలిక తండ్రితో, స్థానిక సర్పంచ్‌తో ఫోన్ లో మాట్లాడి పరామర్శించారు. "ముందు మన పాప ప్రాణాలను కాపాడుకుందాం, అధైర్యపడకండి.. నేనున్నా" అని ధైర్యం చెప్పారు. బాలికకు అత్యున్నత వైద్యం అందించడం కోసం తక్షణమే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పాప వైద్య ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని, బాధిత కుటుంబానికి పూర్తిశ న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి పొంగులేటి భరోసానిచ్చారు.

–బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలి

– ఎంపీ వద్దిరాజు

ఖమ్మం రాపర్తినగర్ లో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు . బాలికను లైంగిక వేధింపులకు గురి చేసి భవనంపై నుంచి తోసేసి చంపడానికి కుట్రపన్నిన రాక్షసుడిపై చట్ట ప్రకారం ఫోక్సో కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను కోరారు. బాధితురానికి మెరుగైన వైద్య సాయమందించి ప్రాణాలు కాపాడాలని, కుటుంబానికి 25లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఇటువంటి అమానుష, అమానవీయ ఘటనలు భవిష్యత్తులో చోటుచేసుకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలసిందిగా రవిచంద్ర సూచించారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అమలుకు టీయూడబ్ల్యూజే వినతి

## మేడ్చల్ డీఈఓ రేణుకాదేవిని కలిసిన ప్రతినిధి బృందం

## - 2026--27 విద్యా సంవత్సరానికి 50 శాతం రాయితీపై ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి



కుత్బుల్లాపూర్, జూన్ 9 (విజన్ ఆంధ్ర); జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయు) మేడ్చల్ జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ప్రతినిధి బృందం మంగళవారం జిల్లా విద్యాధికారి (డీఈఓ) రేణుకాదేవిని కలిసి వినతిపత్రం అందజేసింది. 2026--27 విద్యా సంవత్సరానికి జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఈ రాయితీ వర్తించేలా స్పష్టమైన మార్గదర్శకాలు, ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విద్యా భారం తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ప్రతినిధులు సూచించారు.

ఈ వినతిపై డీఈఓ రేణుకాదేవి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. సంబంధిత అధికారులతో సమీక్షించి త్వరలోనే అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె సూచించినట్లు తెలిసింది. అలాగే, వ్యక్తిగతంగా ఫీజు రాయితీ లెటర్లు అవసరమైన జర్నలిస్టులు జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు రామారావు, ప్రసాద్, భూపాల్, నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎమ్మార్వో కు శుభాకాంక్షల వెల్లువ



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 09: కూకట్ పల్లి మండల తహశీల్దార్ (ఎమ్మార్వో) గా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పలువురు బస్తి నేతలతో కలిసి మంగళవారం అశోక్ కుమార్ ను కలిసి పుష్పగుచ్ఛలను అందిస్తూ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బస్తి లోని సమస్యలను ఎమ్మార్వో కు వివరించారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, రెడ్డి సత్యనారాయణ రెడ్డి, యాదగిరి , లక్ష్మణ్ , కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని వీరులో ఉద్యోగం సాధించిన పెబ్బేరు వాసి

పెబ్బేరు, జూన్ 9 ( విజన్ అంధ్ర ) : పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ గ్రూప్ ఇంగ్లీష్ మీడియం లో 2022--2024 విద్యా సంవత్సరానికి చదివిన విద్యార్థి. ఈ విద్యార్థి తన కృషి, పట్టుదల మరియు క్రమశిక్షణతో ఈ ఘనతను అగ్ని వీరులో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు సిబ్బంది గణేష్‌ను అభినందించి, అతని భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. దేశ సేవకు అంకితమవుతూ యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

అగ్నివీర్‌గా ఎంపిక కావడం ద్వారా గణేష్ కళాశాల ఖ్యాతిని పెంచడమే కాకుండా ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచాడని అధ్యాపకులు పేర్కొన్నారు. సందర్భంగా అగ్ని వీరికి ఎంపికైన బి గణేష్ మాట్లాడుతూ ఈ కళాశాల లో చదువుకోవడం వల్ల ఈ కళాశాల అధ్యాపకుల సూచనలు , సలహాలు నాకెంతో ఉపయోగపడ్డాయని, అందుకే బెంగళూరులోని ఆూజ 1 మిలిటరీ ట్రైనింగ్ సెంటర్ కు వెళ్లే ముందు అధ్యాపకుల ఆశీస్సుల కోసం వచ్చానని తెలిపారు.

ఈ సందర్భంగా బి గణేష్ ను కళాశాల అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది పూల బొకే అందించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంత్ రెడ్డి, సి కృష్ణయ్య, జ్ఞానేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప, బోధనేతర సిబ్బంది విమలాదేవి, కరుణాకర్, వెంకటేష్, మధు, వేణు పాల్గొన్నారు

# పేకాట ఆడుతున్న వ్యక్తులకు పట్టుకున్న పోలీసులు

## - ఏడూ వేల నగదు, ఒక ఆటో స్వాధీనం



జన్నారం, జూన్ 09 (విజన్ ఆంధ్ర) : పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు పట్టుకొని పేక ముక్కలతో పాటు ఏడువేల నగదు ఒక ఆటోను స్వాదినం చేసుకొని కేసు నమోదు చేశారు.మంగళ వారంరోజున జన్నారం ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపూ ర్ గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటలో సోమ వారం రాత్రి కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నా రని వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు తన సబ్బందితో కలసి దాడి చేయగా పేకాట ఆడుతు న్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాసల రవి, గోనె మురళి, కొళ రాజేష్, భూక్య రాజులను పట్టుకోగా మరో నలుగురు పారిపోయినట్లు తెలిపారు. వారి వద్ద నుండి పేక ముక్కలు, ఏడువేల నగదు 4 సెల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పారిపోయిన వారిలో అదే గ్రామానికి చెందిన సురమల్ల ప్రకాష్, పోతుగం టి వెంకటేష్, చింతల రాజ్ కుమార్, మన్నే గూడకు చెందిన గంధం విజయరావులు వున్నారని తెలిపా రు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ దాడిలో పలువురు పోలీసులు వున్నారు.

# జటప్రోలు కృష్ణా నది పరివాహక ప్రాంతంలో అజ్ఞాత వ్యక్తి అస్తిపంజరం

కొల్లాపూర్ జూన్ 9: (విజన్ ఆంధ్ర) పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామ కృష్ణానది పరివార్క ప్రాంతంలో ఒక రైతు వ్యవసాయ భూమిలో గుర్తుతెలియని అజ్ఞాత వ్యక్తి ఎముకలతో కూడిన ఆస్తిపంజరం మంగళవారం కనిపించింది అని గ్రామ పంచాయతీ కార్యదర్శి కౌసర్ సుల్తానా పెంట్లవెల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా సమాచారం తెలిసిన వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పెంట్లవెల్లి పోలీసులు అస్తిపంజరాన్ని పరిశీలించగా, దాని అవశేషాలు లభ్యమయ్యాయి అస్తిపంజరానికి గులాబీ రంగు చొక్కా ఆకుపచ్చ రంగు నిక్కర్ (షార్ట్) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే మృతుడి గుర్తింపుకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పెంట్లవెల్లి ఎస్సై తెలిపారు. అలాగే నృతుడి గుర్తింపును నిర్ధారించుటకు మరణానికి గల కారణాలను తేల్చుకొనుటకు అన్ని కులాల్లో విచారణ జరుపుతున్నామని ఎస్సై అన్నారు. పై వివరాలకు సరిపడే వ్యక్తి ఎవరైనా తప్పిపోయి ఉంటే లేదా మృతుడి గుర్తింపు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పెండ్లి పోలీస్ స్టేషన్కు సంప్రదించగలరని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఫోన్ నెంబర్ 8712657722కు ఫోన్ చేసి సమాచారం తెలుపండి అన్నారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి పోలీసులు జటప్రోలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

కొత్తకోట జూన్ 09 (విజన్ ఆంధ్ర): కొత్తకోట. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా 2026 27 సంవత్సరానికి సంబంధించిన నూతన రేట్లు సివిల్ సప్లై హ మాలి కార్మికులకు పెంచాలని సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ అన్నారు.

మంగళవారం సివిల్ సప్లై గోదాం దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో హ మాలి కార్మికుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం చెల్లిస్తున్న 29 రూపాయలు నుండి 35 రూపాయలకు పెంచాలని మహిళా సి పర్లకు బోనస్ పదివేలు యూనిఫామ్ కుట్టుకూలి స్వీట్స్ బాక్స్ లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ డైరెక్టర్ సంబంధిత అధికారులు హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని గోదాముల దగ్గర మంచినీటి సౌకర్యం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పిఎఫ్ ఆధారంగా 60 సంవత్సరాలు పైబడిన హమాలి కార్మికులకు పెన్షన్స్ సౌకర్యం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన కోరారు. అదేవిధంగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి హమాలి కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో హామాలి కార్మిక సంఘం అధ్యక్షులు యాదయ్య, నెల్లూరు కురుమన్న ,భాస్కరు, రాములు,కృష్ణన్న, పెద్ద గోల గట్టు యాదవ్ ముంత రమేష్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి..

## - ఐదుగురి అరెస్టు

## - పరారీలో మరో ఐదుగురు

రామకృష్ణాపూర్, జూన్ 9 (విజన్ ఆంధ్ర) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దె రాగడి శివారు ప్రాంతంలో రహస్యంగా పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న పది మందిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. వారి నుంచి ద్విచక్ర వాహనం,మూడు సెల్ ఫోన్లు, 8640 నగదు,ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.





## నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తాం

- వ్యవసాయ అధికారిని పూర్ణిమ హెచ్చరిక
- వ్యవసాయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ టీం

కాటారం, జూన్ 9 (విజన్ ఆంధ్ర) :నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని కాటారం మండల వ్యవసాయ అధికారిని పూర్ణిమ హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమెతోపాటు వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ, పోలీసు యంత్రాంగం, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీం తనిఖీలలో పాల్గొన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించినట్లయితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన రసీదులను అందజేయాలని సూచించారు. రైతులకు సకాలంలో ఎరువులు యూరియా బస్తాలను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించినట్లయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా చట్టపరమైన చర్యలు చేపడతామని దుకాణదారులకు తెలిపారు.

## శ్రీ రాచణ్ణ స్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.2.91 లక్షలు

జహీరాబాద్ జూన్ 09 (విజన్ఆంధ్ర) : కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో ఉన్న శ్రీ రాచణ్ణ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీ స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం చేపట్టగా, హుండీ ఆదాయం మొత్తం రూ. 2,91,099 (అక్షరాల రెండు లక్షల తొంభై ఒక వేల తొంభై తొమ్మిది రూపాయలు) వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి. శివరుద్రప్ప, దేవాదాయ ధర్మాదాయ శాఖ సంగారెడ్డి జిల్లా పరిశీలకుడు వి. రంగారావు, గ్రామ సర్పంచ్ దయానంద్ పాటిల్, మాజీ చైర్మన్ శివరాజ్ స్వామి, మాజీ ఉపసర్పంచ్ రాజన్న, సురేష్ స్వామి, రమేష్, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# మీ సేవ కేంద్రంలో అధిక రుసుములు

- అధికారుల ఆకస్మిక తనిఖీ
- ప్రజలకు డబ్బులు వెనక్కి
- ప్రభుత్వ రుసుము 80 రూపాయలే
- బాధితులకు డబ్బు వెనక్కి
- ప్రజలకి అధికారుల హెచ్చరిక
- తనిఖీల్లో పాల్గొన్న అధికారులు: ఈడీఎం. చంద్రశేఖర్, డీఎం. సంసన్



నవాబుపేట, జూన్ 9,(విజన్ ఆంధ్ర): నవాబుపేట మండల కేంద్రంలోని మరికల్ రోడ్డులో ఉన్న మీ సేవ కేంద్రంలో అధిక రుసుములు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. కుల ధ్రువపత్రానికి 80 రూపాయలు, ఆదాయ ధ్రువపత్రానికి 80 రూపాయలు మాత్రమే ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మీ సేవ నిర్వాహకులు నిర్దేశిత రుసుము కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారుల ఆకస్మిక తనిఖీల్లో తేలింది. వెంటనే స్పందించిన అధికారులు ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వద్ద నుంచి అదనంగా తీసుకున్న డబ్బులను మీ సేవ నిర్వాహకుడితో వాపస్ ఇప్పించారు. దీంతో బాధితులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మీ సేవ నిర్వాహకులు ఎవరైనా ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే వెంటనే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని లేదా 1100 నంబర్‌కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. ప్రతి మీ సేవ కేంద్రంలో రుసుముల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఈడీఎం చంద్రశేఖర్, డీఎం సంసన్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమోదు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలి...

## డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి..



బోధన్, జూన్ 09(విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమోదు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని బూత్ లెవెల్ ఏజెంట్లకు డీసీసీ అధ్యక్షులు కాటిపల్లి నగేష్ రెడ్డి సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తరణ సవరణ నేపథ్యంలో ఓట్ల కూర్పులు, చేర్పులపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తరణ సవరణ విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లది కీలకపాత్ర అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడటంతోపాటు, జాబితాలో లోపాలు ఉంటే సరిదిద్దేలా సర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అర్హులందరూ జాబితాలో ఉండేలా దృష్టి పెట్టాలని తెలిపారు. నెల రోజుల పాటు సాగే ఈ ప్రక్రియలో కొత్త ఓట్ల చేరికలు, పాత ఓట్ల తొలగింపులను బీఎల్ఏలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన వారి ఓట్లు తొలగించకుండా ఓటర్లు, అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్, ఆదిత్య రెడ్డి, శశాంక్, గంగాశంకర్, పాషా, నాగేశ్వర్ రావు, దాము, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అసెంబ్లీ కో ఆర్డినేటర్లు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు: మంత్రి జూపల్లి హెచ్చరిక

- సూర్యఘర్ యోజనతో ఉచిత విద్యుత్.. అదనపు ఆదాయం
- పెద్ద ధగడలో నూతన పాఠశాల భవనం పరిశీలన
- గ్రామసభలో పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి వెల్లడి



చిన్నంబావి, జూన్ 9 : (విజన్ ఆంధ్ర ప్రతినిధి) ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల కుటుంబాలు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని కూడా ఆర్జించవచ్చని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్ద ధగడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

-469 కుటుంబాలు అర్హులు

ఎద్దదగడ గ్రామంలో మొత్తం 630 కుటుంబాలు ఉండగా, అందులో ప్రాథమికంగా 469 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించినట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. అర్హత సాధించిన ప్రతి కుటుంబం తమ ఇంటిపై సౌర విద్యుత్ (సోలార్) వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యూనిట్‌కు రూ. 2.50 ఆదాయం

సౌర ఫలకాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను సొంత గృహ అవసరాలకు వినియోగించుకున్న తర్వాత, మిగిలిపోయే అదనపు విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు విక్రయించవచ్చని మంత్రి వివరించారు. గ్రిడ్‌కు సరఫరా చేసే మిగులు విద్యుత్‌కు గానూ ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. 2.50 చొప్పున విద్యుత్ సంస్థలు చెల్లింపులు జరుపుతాయని, దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన అదనపు ఆదాయం సమకూరుతుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామస్థులు కేవలం వినియోగదారులుగా మాత్రమే కాకుండా.. స్వయం విద్యుత్ ఉత్పత్తిదారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

?పాఠశాల భవనం పరిశీలన

?గ్రామ పర్యటనలో భాగంగా పెద్దదగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. పాఠశాల గదులను, మౌలిక వసతులను ఆయన చూశారు. ఈ కార్యక్రమంలో రెడ్కో డీజీఎం భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భాస్కర్, విద్యుత్, విద్యా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

? ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..!

? చిన్నంబావి మండలం అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం

?చిన్నంబావి మండలం అమ్మాపల్లె, వెలుగొండ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, రైతుల ఇబ్బందులపై మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్ల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారిణి అరుణతో మంత్రి ఫోన్లో మాట్లాడి తక్షణమే నిలదీశారు.?కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చే అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంకొకసారి ఇలాంటి పర్యవేక్షణా లోపాలు పునరావృతమైతే కఠినమైన శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేసి, రైతులకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

సుభాష్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల సమస్యలపై ఎమ్మెల్యే వివేక్

# ఆకస్మిక తనిఖీ

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..**

**సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యల ఆదేశం**

**కుత్బుల్లాపూర్ అభివృద్ధి నిరంతర ప్రక్రియ..**

**అన్ని ప్రాంతాలకు మెరుగైన వసతులు కల్పిస్తాం**

**-ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



కుత్బుల్లాపూర్, జూన్ 9 (విజన్ ఆంధ్ర): ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే జేపీ వివేకానంద కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజుల స్వామి నగర్, సిద్ధార్థ్ నగర్, జై శ్రీరామ్ నగర్, మరాఠీ బస్తీలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఆయన మంగళవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాజుల స్వామి నగర్‌లో భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను, సిద్ధార్థ్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ, పారిశుధ్య లోపాలు, వరద నీటి నిల్వ సమస్యలను, జై శ్రీరామ్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, నాలా నిర్వహణ సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ పనుల అమలులో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో కూడా సుభాష్‌నగర్ డివిజన్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి కొనసాగిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఈఈ సుబ్రహ్మణ్యం, డీజీఎం శ్రావణి, వివిధ శాఖల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, వారాల వినోద్, రాజ్‌కుమార్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, రవి, వేణు, మరాఠీ అశోక్, స్వామి, చందు, గట్టు అశోక్, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

## గర్భిణీలు సేవలను వినియోగించుకోవాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్..

భూపాలపల్లి జిల్లా, రేగొండ, జూన్ 9 (విజన్ఆంధ్ర)జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల పరిధిలో ప్రతినెల తొమ్మిదో తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం రేగొండ పీహెచ్‌సీలో నిర్వహించడం జరిగిందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని 10 సంవత్సరాల నుంచి నిర్వహించడం జరుగుతుందని , గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన సమగ్ర గర్భధారణ వైద్య సేవలను అందించడం తల్లి శిశు మరణాలను తగ్గించడం హైరిస్క్ గర్భధారణను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అందించబడే సేవలు గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు, రక్తపోటు, బరువు రక్తహీనత పరీక్షలు,రక్తం,మూత్ర పరీక్షలు మరియు ఇతర అవసరమైన వ్యాపరీక్షలు గర్భస్థ శిశు పెరుగుదల అంచనా అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ సేవలు హైరిస్ గర్భిణీలను గుర్తింపు ప్రత్యేక పర్యవేక్షణ ఐరన్ పోలిక్ యాసిడ్ కాల్షియం మాత్రల పంపిణీ ప్రసవానికి ముందు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య అవగాహన పోషకాహారం తల్లిపాల ప్రాముఖ్యత కుటుంబం మద్దతుపై కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగినది.

గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా తమ మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డు వెంట తీసుకురావాలి. కనీసం నాలుగు ఏఎంసీ చెకప్ లు చేయించుకోవాలి.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సురక్షిత మాతృత్వం ఆరోగ్యకరమైన శిశు లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి తెలియజేశారు.

ఈరోజు జిల్లా వ్యాప్తంగా 237మంది గర్భిణీ స్త్రీలను పరీక్షలు జరిపి 46 మంది హైరిస్క్ గర్భిణీ స్త్రీలను సేవలు అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హిమబిందు సూపర్వైజర్లు ఆశాలు పాల్గొనడం జరిగినది.

# విద్యార్థులు ఉన్నతంగా చదివి వృద్ధిలోకి రావాలి

**- కౌన్సిలర్ జెర్కోని మమత రాజు**

ఇబ్రహీంపట్నం, జూన్ 9 (విజన్ ఆంధ్ర ) : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కౌన్సిలర్ జెర్కోని మమత రాజు అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ప్రభుత్వ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ జెర్కోని మమత రాజు తమ సొంత ఖర్చులతో స్కూల్ కిట్లు ( నోట్ బుక్స్, బ్యాగ్ స్టేషనరీ ) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నతంగా చదివి వృద్ధిలోకి రావాలని కోరారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు సులువుగా ఉంటుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని కోరారు. మంచి మార్గంలో పయనించాలని కోరారు. విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు,ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాలని సూచించారు. విద్యార్థులకు



ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మంద సుధాకర్, కొండ్రు రవి, షబ్బీర్, సొప్పరి కరుణాకర్, కొండ్రు మహేష్, కొండ్రు ప్రభు, విజయ్, చేతల జంగయ్య, శ్రీకాంత్, సన్నీ, శివ, కార్తీక్, జలెందర్, శివప్రసాద్, కిషోర్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడికి నీరాజనం

**- గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీకగా కేశపురంలో కొమురం భీమ్ విగ్రహం**

**- విప్లవ జ్యోతికి ఘన నివాళి భీమ్ ఆశయాలే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

?చర్ల, జూన్ 09 (విజన్ ఆంధ్ర): అడవి బిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక, నిరంకుశ పాలనపై 'జల్-జంగిల్-జమీన్' అని గర్జించిన విప్లవ యోధుడు కొమురం భీమ్ ఆశయాలు వర్ధిల్లుతాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఉద్ఘాటించారు, చర్ల మండలంలోని కేశపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

గిరిజన సంప్రదాయాలకు పెద్దపీట

ఎమ్మెల్యే రాకతో కేశపురం గ్రామం పులకించిపోయింది, గిరిజన సంప్రదాయ వాయిద్యాల హోరు, మహిళల కోలాటాలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. భీమ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, గంగాధర స్మృతితో నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసేపు గిరిజన సాంప్రదాయ నృత్యాల్లో భాగస్వాములవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




భీమ్ పోరాటం - నేటి సమాజానికి దిక్సూచి

సభను ఉద్దేశించి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, కొమురం భీమ్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక ఉద్యమ శక్తి. వనవాసుల హక్కుల కోసం నైజాం నవాబుల గుండెల్లో సింహస్వప్నంగా మారిన భీమ్ చరిత్ర, నేటి తరానికి ఆదర్శం. అడవిని, భూమిని, నీటిని కాపాడుకోవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి, గిరిజనుల విద్యా, వైద్య, ఉపాధి అవకాశాల కోసం నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది అని పేర్కొన్నారు.

అభివృద్ధి బాటలో అడవి బిడ్డలు

చర్ల మ అధ్యక్షుడు విజయ్ నాయుడు మాట్లాడుతూ,గిరిజనుల సమస్యల పరిష్కారంలో మేము ఎప్పుడూ ముందుంటాం, భీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, కేశపురం వంటి మారుమూల గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం, సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అందరూ కలిసి నడవాలి, అని పిలుపునిచ్చారు.

జన ప్రభంజనం

కేశపురం గ్రామంలోని ఈ కార్యక్రమం గిరిజన ఐక్యతకు వేదికైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది గిరిజన సోదరుల నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కావుల శారద నాగరాజు మాట్లాడుతూ కొమురం భీమ్ అమర్ రహే, మా గడ్డ - మా హక్కు అంటూ వారు చేసిన నినాదాలు భీమ్ పోరాట స్ఫూర్తిని గుర్తు చేశాయి.

?ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావుల శారద, కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు కావుల నాగరాజు కేశవాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆదివాసి సంఘాల నాయకులు, పంచాయితీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, గిరిజన కుల సంఘాల పెద్దలు, మహిళలు, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.